



శనివారం రాత్రి ఇచ్ఛాపురంలో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అశోక్



ఇచ్ఛాపురం : సురంగిరాజామైదానంలో శంఖారావం సభకు సిద్ధమైన వేదిక

శంఖారావం

- జిల్లాలో నేటి నుంచి నారా లోకేశ్ యాత్ర
- ఇచ్ఛాపురంలో ప్రారంభానికి ఏర్పాట్లు
- ప్రతిరోజు మూడు నియోజకవర్గాల్లో సభలు



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి నారా లోకేశ్ చేపట్టనున్న 'శంఖారావం' యాత్రకు సర్వం సన్నద్ధమైంది. ఇచ్ఛాపురంలో ఆదివారం ఈ యాత్ర ప్రారంభించి.. రాష్ట్రవ్యాప్తంగా 120 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చాక కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించనున్నారు. యువగళం పాదయాత్ర విశాఖ వరకే చేపట్టి.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి వద్ద ముగింపు సభ నిర్వహించారు. అప్పట్లో పరిస్థితుల కారణంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో లోకేశ్ పర్యటించలేదు. ఈ నేపథ్యంలో పాదయాత్ర చేపట్టని నియోజకవర్గాల్లో ముందుగా శంఖారావం సభలు నిర్వహించనున్నారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహించేలా 'శంఖారావం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రోజూ మూడు నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. ప్రజల్లో మరింత ఆదరణ పొందేలా ఎన్నికల ప్రచారం ఇక్కడ నుంచే ప్రారంభించనున్నారు. పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపనున్నారు. ప్రతి నియోజకవర్గంలో సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ప్రజాసంఘాలకు, ఉద్యోగసంఘాల ప్రతినిధులకు, కార్యకర్తలకు అవకాశం కల్పించారు. అలాగే 'సెల్ఫీ విత్ లోకేష్' కార్యక్రమానికి కూడా సమయం కేటాయించనున్నారు. తొలిరోజున ఆదివారం ఇచ్ఛాపురంలో ఉదయం 10.30 గంటలకు కార్యకర్తలు, ప్రజలతో సభ నిర్వహిస్తారు. మధ్యాహ్నం పలాసలో, సాయంత్రం టెక్కలి నియోజకవర్గంలో సభ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి 10.45 గంటలకు లోకేశ్, టీడీపీ కీలక నేతలు ఇచ్ఛాపురం చేరుకున్నారు. లోకేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు పూర్తిచేశారు.

● ఇదీ షెడ్యూల్

11న ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర సభలు నిర్వహిస్తారు.
12న నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో..
13న పాతపట్నం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో..
14న పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి నియోజకవర్గాల్లో ..
15న రాజాం, చీపురుపల్లి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో..
16న నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల్లో..
17న ఎస్.కోట, పెందుర్తి, భీమిలిలో..
18న విశాఖపట్నం తూర్పు, దక్షిణం, ఉత్తరంలో..
19న విశాఖపట్నం పశ్చిమం, గాజువాక, అనకాపల్లిలో
20న చోడవరం, వి.మాడుగుల,నర్సీపట్నంలో యాత్ర నిర్వహిస్తారు.
21న పాయకరావుపేటతో ఉత్తరాంధ్రలోని యాత్ర ముగుస్తుంది.

● టీడీపీలో జోష్

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో నిర్వహించిన సర్వేలో టీడీపీకి అపూర్వ ఆదరణ లభించనున్నట్లు వెల్లడైంది. ఇప్పటికే జోష్‌తో ఉన్న పార్టీ శ్రేణుల్లో.. లోకేశ్ శంఖారావం యాత్రలో మరింత ఉత్సాహం పెరగనుంది. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లోనూ వ్యతిరేకత పెరగడంతో.. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో లోకేశ్ సభల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. లోకేశ్‌ను కలిసి సమస్యలపై వినతులు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఈ పరిణామాలు తెలుగు తమ్ముళ్లలో మరింత జోష్ పెంచుతోంది.



టెక్కలిలో శంఖారావం సభాస్థలిని పరిశీలిస్తున్న అచ్చెన్నాయుడు

లోటుపాట్లు ఉండరాదు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని, ఎక్కడా లోటుపాట్లు ఉండరాదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు టెక్కలిలోని నాలుగురోడ్ల కూడలిలో లోకేశ్ సభ నిర్వహించనున్నారు. ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. వేదిక, బారికేడ్లు, వాహన రాకపోకలకు సౌకర్యాలు తదితర వాటిపై చర్చించి సూచనలు చేశారు. సభాస్థలి ప్రాంగణాన్ని డీఎస్పీ బాలచంద్రారెడ్డి కూడా సీఐలు పైడయ్య, చంద్రమౌళితో కలిసి పరిశీలిం చారు. ఇబ్బందులు లేకుండా సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరికి ఆదేశించారు.

విజయవంతం చేయండి: ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 10: నారా లోకేశ్ శంఖారావం యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఇచ్ఛాపురంలోని సురంగిరాజా మైదానంలో శంఖారావం సభా ప్రాంగణం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అరాచకాలను ప్రజలకు వివరించేందుకు, పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపేందుకు లోకేశ్ శంఖారావం యాత్రకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికిజాని, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, తెలుగుయువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, రెయ్యి జానకిరావు, ఆశి లీలారాణి, ఆశి జీవులు, జిలానీ, బి. కృష్ణయ్య, సాలిన జగదీష్, కోటి పాల్గొన్నారు.



పలాసలో ఏర్పాట్లు పరిశీలించిన శిరీష

పలాస: కంబిరిగాం జంక్షన్ వద్ద నారా లోకేశ్ ఎన్నికల శంఖా రావం బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష శనివారం పరిశీలించారు. లోకేశ్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొలత.. కలత!

- ఫ్లైఓవర్ నిర్మాణానికి అదనపు కొలతలు
- ఇళ్లు, షాపులకు మించి మార్కింగ్
- ఆందోళనలో రణస్థలం వాసులు



● రణస్థలం ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలంలో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద హైవే ఫ్లైఓవర్ నిర్మాణానికి 26 మీటర్లకు మార్కింగ్ ఇచ్చారు. ఇప్పుడున్న రోడ్డు డివైడర్ నుంచి ఒకవైపు కొలతలు వేసి అధికారులు, సిబ్బంది మార్కింగ్ చేస్తున్నారు.

....

● అక్కడకు 300 మీటర్ల దూరంలో మరోలా మార్కింగ్ ఇచ్చారు. ఓ సొసైటీ బ్యాంకు స్థలంలో ఏర్పాటు చేసిన షాపుల వద్ద దాదాపు 33.1 మీటర్ల దూరంలో మార్కింగ్ ఇచ్చారు. ఈ లెక్కన షాపులన్నీ తొలగించాల్సి ఉంటుందని యజమాని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

....

● గరికిపాలెం షిర్డీసాయి ఆలయ సమీపంలో ఏకంగా 37.1 మీటరూ వరకూ కొలిచి మార్కింగ్ ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న షాపులన్నీ తొలగిస్తారని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

(రణస్థలం)

ఇలా జాతీయ రహదారి సంస్థ అధికారులు, సిబ్బంది కొలత లెక్కలతో రణస్థలం ప్రజలు, వ్యాపారులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. రణస్థలం వద్ద హైవేపై స్తంభాలతో కూడిన వంతెన నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థ నిర్ణయించిన సంగతి తెలిసిందే. విశాఖ నుంచి నరసన్నపేట వరకూ జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయినా ఇక్కడ మాత్రం పెండింగ్ పెట్టారు. ఇక్కడ బైపాస్ నిర్మిస్తామా? లేదా ఫ్లైఓవర్ నిర్మాణమా అన్నది తేల్చక తీవ్ర జాప్యం చేశారు. ఇప్పుడు ఫ్లైఓవర్‌కే మొగ్గుచూపారు.

● ఎనిమిదేళ్ల కిందట విస్తరణ

2016లో జాతీయ రహదారి విస్తరణకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పట్లో రోడ్డుకిరువైపులా 22.5 మీటర్లు అంటే 75 అడుగుల రోడ్డును విస్తరించేందుకు నిర్ణయించారు. ఆ మేరకు షాపులు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను తొలగించారు. పరిహారం అందించినా చాలామంది బతుకులు తారుమారయ్యాయి. ఆస్తులు పోయాయి. ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని చెప్పడంతో గతంలో సేకరించిన భూమిలోనే నిర్మిస్తారని అంతా భావించారు. కానీ 22.5 మీటర్లకు మించి కొలత చేపడుతుండడంతో అందరిలోనూ భయం వెంటాడుతోంది. గతంలోనే విలువైన స్థలాలను కోల్పోయామని.. ఎలాగోలా ఉన్నస్థలాన్ని కాపాడుకొని షాపులు, ఇళ్ల నిర్మాణాలుగా మార్చుకుంటే ఇప్పుడు మళ్లీ కొలుస్తుండడంతో కలత చెందుతున్నారు. ఒక దగ్గర 26, మరో దగ్గర 27, ఇంకోదగ్గర 37 మీటర్లు చొప్పున కలిసి మార్కింగ్ వేస్తుం డడంతో కలవరపడుతున్నారు. జాతీయ రహదారి సంస్థ అధికారులు తమ కొంప ముంచేలా ఉన్నారని ఆందోళన చెందుతున్నారు.

● టీడీపీ హయాంలో బైపాస్..

టీడీపీ హయాంలో 2016లో రణస్థలం మండల కేంద్రానికి బైపాస్ మంజూరైంది. అప్పట్లో కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి కళా వెంకటరావు చొరవతో బేవరేజెస్ ఫ్యాక్టరీ నుంచి లావేరు మండలం రావివలస వరకూ బైపాస్ మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తయింది. ప్రభుత్వం అందించే పరిహారం చాలదని.. రెట్టింపు ఇవ్వాలని అప్పటి విపక్షమైన వైసీపీ నేతలు రెచ్చగొట్టారు. దీంతో వివాదం కావడంతో రణస్థలాన్ని విడిచిపెట్టి మిగతా చోట్ల పనులపై జాతీయ రహదారుల సంస్థ అధికారులు దృష్టిపెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరవాత బైపాస్ అంటే భూసేకరణ, రహదారి నిర్మాణానికి భారీగా ఖర్చు అవుతుందని అంచనా వేశారు. దానికంటే ఫ్లైఓవర్ నిర్మాణానికే మొగ్గుచూపారు. కానీ వైసీపీ ప్రజాప్రతినిధులు నోరు తెరవడం లేదు. ఫ్లైఓవర్ నిర్మా ణంతో తమ బతుకులు పోతాయని వ్యాపారులు ఆందోళన చెందారు. పిల్లర్స్‌తో కూడిన వంతెన నిర్మిస్తామని చెప్పడంతో శాంతించారు. కానీ ఇప్పుడు ఏకంగా ఉన్న షాపులు, ఇళ్లను తొల గించేలా వంతెనకు మార్కింగ్ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే కొలతలు సైతం సచివాలయ సిబ్బందితో వేయిస్తుండడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ ఉన్నతాధికారులు, జాతీయ రహదారి సంస్థ అధికారులు కనిపించకపోవడం విమర్శలకు కారణ మవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులతోపాటు హైవే అధికారులు స్పందించి ఈ కొలతల విషయంలో స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



ఫ్లైఓవర్ కోసం మార్కింగ్..

● భయం వేస్తోంది..

ఫ్లైఓవర్ నిర్మాణానికిగాను వేస్తున్న కొలతలు చూస్తుంటే భయం వేస్తోంది. గతంలోనే రోడ్డు విస్తరణలో విలువైన ఆస్తులను కోల్పోయాం. ప్రభుత్వం పరిహారం ఇచ్చినా అది ఏ మూలకు చాలలేదు. ఇప్పుడు ఇళ్లు, షాపులను దాటించి కొలతలు వేస్తున్నారు.

- గాజుల భాస్కరరావు, షాపు యాజమాని, రణస్థలం

● అంత వ్యత్యాసమా?

కొలతల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఒకచోట 26 మీటర్లు వేస్తున్నారు. మరికొన్నిచోట్ల 37మీటర్లు తీస్తున్నారు. అలా ఏంటని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు.

-ఇడదాసుల తిరుపతిరాజు, వ్యాపారి, రణస్థలం

● హైవే అధికారులు లేరు..

హైవే అధికారులు లేకుండా.. దిగువస్థాయి సిబ్బందితో సర్వే చేయిస్తున్నారు. రెవెన్యూ కీలక అధికారులు సైతం కనిపించడం లేదు. కేవలం సచివాలయ సిబ్బందితో కొలతలు తీయడం ఏమిటి. ఇంతటి భారీ ప్రాజెక్టు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉంది.

- డీజీఎం కిషోర్‌కుమార్, రణస్థలం

ఎమ్మెల్యేకు అడ్డుగా ఉన్నాననే.. నన్ను హత్య చేయాలనుకున్నారు

- డబ్బులకు ఎంపీపీ టికెట్ అమ్ముకున్నాడు
- కిరణ్‌కుమార్ తీవ్ర అన్యాయం చేశారు
- ఎచ్చెర్ల వైసీపీ నేత జరుగుళ్ల శంకర్ ఆరోపణ
- తనపై హత్యాయత్నంపై తీవ్ర వ్యాఖ్యలు
- మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలింపు



చికిత్స పొందుతున్న శంకరరావు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 10: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రాజకీయాలకు అడ్డుగా ఉన్నాననే తనను హత్య చేయాలనుకున్నారని వైసీపీ నేత జరుగుళ్ల శంకర్ ఆరోపించారు. ఎచ్చెర్లకు చెందిన వైసీపీ నేత, వైస్ ఎంపీపీ ప్రతినిధి జరుగుళ్ల శంకరరావుపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన ఆయనను శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విశాఖపట్నం తరలించారు. ఈ నేపథ్యంలో తనపై సొంతపార్టీకి చెందినవారే హత్యయత్నం చేయించారని ఆరోపిస్తూ.. శనివారం శ్రీకాకుళం ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. '2019 నుంచి పార్టీ కోసం ఎనలేని కృషి చేశాను. నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారు. తీరని అన్యాయం చేశారు. ఎంపీపీ సీటు డబ్బులకు అమ్ముకున్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీపీ మొదలవలస చిరంజీవి, కార్యకర్త సత్యనారాయణ నన్ను వేధిస్తున్నారు. ఆ ముగ్గురే నాపై హత్యాయత్నం చేయించి ఉంటారు. గతంలో కూడా సెప్టిక్ ట్యాంకర్‌తో నా కారును గుద్దించారు. అయితే ఆ కారులో నేను లేను. మా వాళ్లకు గాయాలయ్యాయి. ప్రస్తుతం సాక్ష్యాలు చూపించలేకపోయినా.. నాపై హత్యాయత్నం జరిగిందని గ్రామస్థులందరికీ తెలుసు. ఈ విషయాన్ని పార్టీ పెద్దలు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి.. నాకు న్యాయం చేయాలి' అని అన్నారు.

ఎమ్మెల్యేని అడ్డుకున్న కార్యకర్తలు

బగ్గు సరోజినిదేవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్‌ను పరామర్శించేందుకు శనివారం వేకువజామున ఎమ్మెల్యే కిరణ్ వెళ్లగా.. కుటుంబ సభ్యులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. వెనక్కి వెళ్లిపోవాలని చెప్పారు. కిరణ్ అనుచరులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. ఘర్షణ వాతావరణం తలెత్తింది. దీంతో ఎమ్మెల్యే కిరణ్ అక్కడి నుంచి వెనుదిరిగారు.

అర్ధరాత్రి హైడ్రామా

శుక్రవారం రాత్రి శంకరరావును మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి ఆస్పత్రికి వచ్చి.. తనను ఎమ్మెల్యే కిరణ్ పంపించారని, పక్కకు వెళ్లి మాట్లాడుకుందామని రాజీ మంత్రం చేపట్టారు. దీంతో శంకర్‌కు రక్షణ లేదని.. మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. దీంతో ఆయనను ఇలిసిపురంలోని బగ్గు సరోజినిదేవి ఆస్పత్రికి తరలించారు.

నిందితుల కోసం ఆరా

ఎచ్చెర్ల: శంకరరావుపై దాడి చేసిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. జేఆర్ పురం సీఐ రామచంద్రరావు, ఎస్ఐ చిరంజీవి ఆస్పత్రికి చేరుకుని శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శంకరరావుపై దాడికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

జగన్‌రెడ్డి అరాచకాలపై శంఖారావం

- లోకేశ్ పర్యటనను విజయవంతం చేయండి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి/ఆమదాలవలస, ఫిబ్రవరి 10: సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పూరించేందుకు సిద్ధమయ్యారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవి కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన శ్రీకాకుళం, ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయాల్లో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో, 12న నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, 13న పాతపట్నం నియోజకవర్గాల్లో జరిగే లోకేశ్ పర్యటనను శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనలో బాధితులుగా మారిన అన్ని వర్గాల సమస్యలను లోకేశ్ తెలుసుకుని వాటిని నోట్ చేసుకుంటారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి వారికి చేరువ కావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు.

శంఖారావంతో వైసీపీలో వణుకు: కళా

ఎచ్చెర్ల: లోకేశ్ చేపట్టిన శంఖారావంతో వైసీపీలో వణుకు కన్పిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం ఎచ్చెర్ల నియోజక వర్గ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 15న సాయంత్రం 3 గంటలకు లావేరులో నిర్వహించనున్న శంఖారావం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బెండు మల్లేశ్వర రావు, ముప్పిడి సురేష్, లంక శ్యామ్, కుమరాపు రవికుమార్, పార్టీ నేతలు వావిలపల్లి రామకృష్ణ, అన్నెపు భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తరలిరండి: లక్ష్మీదేవి

● **శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి):** శ్రీకాకుళంలో సోమవారం జరగనున్న శంఖారావం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న పొలిట్ బ్యూరో సభ్యుడు కళావెంకటరావు

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కోరారు. ఈ మేరకు శనివారం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, పార్టీ నగర అధ్యక్షుడు మాదరావు వెంకటేష్ పాల్గొన్నారు. ● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం సురంగిరాజా మైదానంలో ఆదివారం జరిగే లోకేశ్ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు కోరారు. శనివారం వివిధ గ్రామాల్లో ప్రజలను కలిశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సాడి సహదేవురెడ్డి, నాయకులు దక్కత కామేశ్వరరావు, లోపింటి పద్మనాభం, బోర ప్రసాద్ పాల్గొన్నారు. ● **గార:** శ్రీకాకుళంలో ఈ నెల 12న జరిగే లోకేశ్ పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం బలరాంపురం, తదితర గ్రామాల్లో స్థానిక పెద్దలను కలిసి మాట్లాడారు. నాయకులు జల్లు రాజీవ్, ఎల్.రాధాకృష్ణ రెడ్డి, పి.కృష్ణ రెడ్డి, చమల్ల సాయి వికాస్ తదితరులు పాల్గొన్నారు. ● **లావేరు:** ఈ నెల 15న లోకేశ్ లావేరులో చేపట్టనున్న శంఖారావాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర కోరారు. శనివారం లావేరులోని సభాప్రాంగణాన్ని చదును చేశారు. ● **నందిగాం:** టెక్కలిలో ఆదివారం జరగనున్న శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలాకి చంద్రశేఖరరావు కోరారు. ఈ మేరకు పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచనలిచ్చారు. పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ ఈ సభకు హాజరవు తున్నందున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు కావాలన్నారు. ● **హరిపురం:** కంబిరిగాం వద్ద ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపడుతున్న శంఖారావం సభకు పార్టీ క్యాడర్, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య ఒక ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమయ్యే సమావేశానికి కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు. ● **జలుమూరు (సారవకోట):** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపడుతున్న శంఖారావం బహిరంగ సభకు తరలి రావాలని ఆ పార్టీ నేతలు సురవరపు తిరుపతిరావు, జయరాం తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం మహాసింగి, మాకువ తదితర గ్రామాల్లో పర్యటించి పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలను కలిసి చైతన్యం చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

లోకేశ్ శంఖారావం సభకు భారీ ఏర్పాట్లు

- రానున్నది టీడీపీ ప్రభుత్వమే
- ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరీష

పలాస: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల శంఖారావం బహిరంగ సభ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కంబిరిగాం జంక్షన్ వద్ద నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్, వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఈ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. అన్ని సర్వేలతో పాటు తాము పడుతున్న కష్టానికి ప్రజల నుంచి తగిన ఫలితం వస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు పీరుకట్ల విఠల్‌రావు, దువ్వాడ హేమబాబుచౌదరి, కుత్తుమ లక్ష్మణరావు, తలగాన నర్సింహ మూర్తి, దువ్వాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దగాకోరు పాలనపై శంఖారావం: బగ్గు

నరసన్నపేట: సీఎం జగన్‌రెడ్డి దగాకోరు పాలనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం యాత్ర చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. శ్రామిక, యువత, రైతులకు నడ్డి విరిచిన జగన్ దుష్పరిపాలనపై లోకేష్ శంఖారావం యాత్ర ద్వారా ప్రజలను జాగృతి చేస్తున్నారన్నారు. మహిళలను చైతన్య వంతులను చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకుడు మహంతి చిన్నంనాయుడు, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, కత్తిరి వెంకటరమణ, భాస్కరరావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి: కలమట

పాతపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి కోరారు. సప్తగిరి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, బూత్ కన్వీనర్లు, నేతలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 13న లోకేష్ శంఖారావం చేపట్టనున్నందున ఐదు మండలాల నుంచి నేతలు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి



ఇచ్ఛాపురం: లొద్దపుట్టిలో మాట్లాడుతున్న ఢిల్లీరావు



గార: మాట్లాడుతున్న జల్లు రాజీవ్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

నరసన్నపేట, ఫిబ్రవరి 10: ఇంటర్ ప్రాక్టికల్స్‌ను ఆదివారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రెండో విడతలో 113 కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ఏ కళాశాలలలో విద్యార్థులు చదువుతున్నారో అదే కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. పరీక్షలు నిర్వహించే అధ్యాపకులను జంబ్లిక్ విధానంలో ఆయా కేంద్రాలను కేటాయించారు. జిల్లాలో 14,576 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయనున్నారు.

ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు

ప్రాక్టికల్స్ అనంతరం ఎగ్జామినార్ పేపర్లను మూల్యాంకనం చేసిన తరువాత వైవా, రికార్డులకు సంబంధిత మార్కులను ఎగ్జామినార్ సీసీ కెమెరా ఎదుట కూర్చొని కంప్యూటర్‌లో నేరుగా నమోదు చేయాలని ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎగ్జామినార్లకు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఎగ్జామినార్ చిన్న తప్పిదం చేసినా విద్యార్థుల భవిష్యత్‌కు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. అయితే సాంకేతిక సమస్యలు ఏర్పడితే తమను బాధ్యులుగా చేస్తారని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎగ్జామినార్లకు ప్రలోభాలు?

ప్రాక్టికల్స్ పరీక్షలకు 50 మంది సైన్స్ విద్యార్థులుంటే సెల్ఫ్ సెంటర్ ఇచ్చారు. విద్యార్థులను జంబ్లింగ్ చేయకపోవడంతో ఇప్పటికే జిల్లాలో పలు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఎగ్జామినార్లను ప్రలోభాలకు గురిచేస్తున్నాయన్న ఆరోపణలొస్తున్నాయి. కళాశాలలో టాపర్లకు శతశాతం ప్రాక్టికల్స్‌లో మార్కులు వేసేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై ఆర్ఐవో దుర్గారావు వద్ద ప్రస్తావించగా ప్రాక్టికల్స్‌లో మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షలకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా 08942-295933 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు.

పట్టాలిచ్చి స్థలాలివ్వలేదు

- మండల సమావేశంలో జడ్పీటీసీ బుచ్చిబాబు

పాతపట్నం: హిరమండలం తహసీల్దార్ కార్యాలయం వెనుక 158 పేద కుటుంబాలకు పదేళ్ల కిందట పట్టాలిచ్చారని, అయితే నేటికీ స్థలాలు అప్పగించకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు అన్నారు. హిరమండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. అప్పటిలో లోతట్టుగా ఉన్న ఈ ప్రాంతాన్ని చదును చేసేందుకు ఒక్కో కుటుంబం నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేశారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే కొంతభాగం చదును చేసి మిగిలి నది వదిలేశారని, ప్రస్తుతం ఆ స్థలం ఆక్రమణలో ఉందన్నారు. అప్పుడు పట్టాలిచ్చిన వారి కి జగనన్న ఇళ్ల కాలనీ మంజూరు చేయలేదని, దీంతో వారంతా సొంత ఇల్లు లేక పట్టాలకే పరిమిత మయ్యారన్నారు. ఆక్రమణలో ఉన్న స్థలాన్ని గుర్తించి ప్లాట్లు వేసి పట్టాలున్న పేదలకు అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ మూకళ్ల చిన్నయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఎంపీటీసీ మీసాల రజని కలుగజేసుకొని జడ్పీటీసీతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత సమయం గందరగోళ పరిస్థితి నెలకొంది. స్థలాన్ని పరిశీలించి పేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.సుధాకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.



జడ్పీటీసీ బుచ్చిబాబుతో వాగ్వాదానికి దిగిన వైసీపీ ప్రజాప్రతినిధులు

ఈనెల 20 వరకే ధాన్యం కొనుగోలు

నరసన్నపేట: ఈఏడాది ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యా న్ని ఈనెల 20వ తేదీ వరకే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని వ్యవసాయాధికారి సునీత అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం ఎంపీపీ ఆరంగి మురళీధర్ అధ్యక్షతన నిర్వహించారు. జల్‌జీవన్ పనులు వేగవంతం చేయాలని, అందరికీ ఒకే రకమైన పైపులను వేయాలని ప్రజాప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లు రాగా కేవలం రూ.50 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని మిగిలిన నిధులతో ఎన్నికల కోడ్‌కు ముందే పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులు కోరారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌కు ఎంజీఆర్ ఘన స్వాగతం

పాతపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు విశాఖ విమానాశ్రయంలో టీడీపీ నాయ కుడు మామిడి గోవిందరావు శనివారం ఘనస్వాగతం పలికారు. ఉత్తరాంధ్రలో శంఖారావం కార్యక్రమానికి వచ్చిన లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఎంజీఆర్‌ను లోకేశ్ ఆప్యాయంగా పలుకరించారు. ఈనెల 13న పాతపట్నంలో నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



తాగునీరివ్వలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం

- దేగల పోలూరులో గిరిజనుల ఆందోళన

మెళియాపుట్టి: గిరిజనులుకు తాగునీరివ్వలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని దండకారణ్య లిబరేషన్ ఆర్గనైషన్ జిల్లా అధ్యక్షుడు సవర కుమార్ విమర్శించారు. శనివారం డేగల పోలూరు గ్రామంలో బోరు వద్ద గిరిజనులు ఆందోళన చేపట్టారు. బోరు నీరు లేక పొలాల్లోని బావుల వద్ద నుంచి నీటిని తీసుకు వచ్చి వినియోగిస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నామని వారు వాపోయారు. బోర్లు తవ్వినా మోటార్లు అమ ర్చలేదన్నారు. దీనబంధుపురం పంచాయతీలో గ్రానైట్ పాలిష్ యూనిట్లు ఉన్నాయని, పంచాయతీకి ఆదాయం వస్తున్నా తాగునీరివ్వని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని దాహార్తిని తీర్చాలని వారు డిమాండ్ చేశారు.



డేగలపోలూరులో ఆందోళన చేస్తున్న గిరిజనులు

గ్రామాల అభివృద్ధికి చర్యలు

వజ్రపుకొత్తూరు: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పల్లివూరు, కంబాలరాయుడు గ్రామాల్లో శనివారం గ్రామ సచివాలయాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి భాస్కరరావు, ఎంపీపీ నీలవేణి, జడ్పీటీసీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

పాతపట్నం: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో హిరమండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్-12 విభాగంలో టి.గుణశ్రీ బంగారు, అండర్-14 విభాగంలో జి.చాందిని కాంస్య, అండర్-15 విభాగంలో టి. ఝాన్సీలక్ష్మి బంగారు పతకం సాధించారు. వీరిని ప్రత్యేకాధికారి కృష్ణవేణి, శిక్షకుడు తోట సింహాచలం, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎల్.ఎన్.పేట: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కోవిలాం జంక్షన్ వద్ద శనివారం నాల్గో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులను స్వయంశక్తి సంఘాల సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బి.నారాయణ రావు, ఏపీఎం రవిరాజ్, ఈవోపీఆర్డీ ఐ.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

పోలాకి: తెలుగు రాష్ట్రాల నుంచి తొలి ప్రధానిగా వ్యవహరించిన పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడంపై గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం మండల నాయకులు దార్లపూడి వెంకట కృష్ణశర్మ, రామశర్మ అనంతశర్మ, పులుగుర్త నాగేశ్వరశర్మ, రమణశర్మ హర్షం వ్యక్తంచేశారు. శనివారం వారు మాట్లాడుతూ దేశాన్ని ఆర్థిక శక్తిగా మలచడంలో ప్రధానపాత్ర పోషించిన పీవీ చిత్రంతో తపాలా ముద్రను విడుదల చేయాలని కోరారు.

సైన్ లాంగ్వేజ్ చార్ట్ విడుదల

ఎల్.ఎన్.పేట: దేశాభివృద్ధిలో దివ్యాంగులు కీలక పాత్ర వహిస్తున్నారని ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి అన్నారు. భవిత కార్యాలయంలో శనివారం బధిర (మూగ) విద్యార్థులకు ఉపయోగపడే సైన్ లాంగ్వేజ్ చార్ట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సక్షం జిల్లా కన్వీనర్ ఎంకే మిశ్రో, ఎల్.ఎన్.పేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జీఎం పాత్రో, ఐఈఆర్టీ ఎస్.సురేష్‌కుమార్, ఎమ్మార్పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సైన్ లాంగ్వేజ్ చార్ట్‌ను విడుదల చేస్తున్న ఎంఈవోలు

ఆన్‌లైన్ ఓటర్ల దరఖాస్తుల పరిశీలన

నందిగాం: పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు, తొలగింపులపై ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంలో రెవెన్యూ సిబ్బంది బిజీగా ఉన్నారు. శనివారం తహసీల్దార్ వి.పద్మావతి ఆధ్వర్యంలో బీఎల్వోలు, సిబ్బంది ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఉప తహసీల్దార్ ఎన్.భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

అపరాల పంటకు మంచు దెబ్బ

పలాసరూరల్: పలాస నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్యపంటగా ఉన్న జీడి పంటకు మంచు దెబ్బ తగిలింది. గడచిన కొద్ది రోజులుగా పొగమంచు కురుస్తుండడంతో పంట ఎండిపోతోంది. దీంతో తాము నష్టపోతున్నామని జీడి రైతులు వాపోతున్నారు. నాలుగు రోజులుగా సాయంత్రం నుంచి మంచు కురియడం, వాతావరణం మబ్బుగా ఉండడంతో జీడి పూతకు, పిందెలకు తీరని దెబ్బ తగులుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఆలస్యంగా పూత, పిందెలు కాయడంతో నిరాశతో ఉన్న రైతులకు మంచుతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదనకు గురవుతున్నారు.



మాడిన జీడి పూత (సర్కిల్‌లో)

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

పలాసరూరల్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపడుతున్న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐసీసీటీయూ సభ్యులు కుత్తుమ దుష్యంత్, టి. దాలమ్మ కోరారు. నీలావతి గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద శనివారం వేతనదారులతో మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ సంస్థలకు దాసోహమై నిరుపేదల ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. వ్యవసాయరంగానికి ఇచ్చిన హామీలను మరిచి కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారన్నారు. వీటికి నిరసనగా చేపడుతున్న బంద్‌కు కార్మికులంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాస్, లక్ష్మి, అరుణమ్మ, స్వర్ణ, విజయ్, తామడ చంద్రవతి పాల్గొన్నారు. ● **మందస:** కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. మందస సీఐటీయూ కార్యాలయంలో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు, రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోయా రన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని, కార్మిక వ్యతిరేక బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దిలీప్ కుమార్, పి.దేవేంద్ర, కె.కేశవరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కుటుంబానికి అచ్చెన్న పరామర్శ

టెక్కలి/నందిగాం: ఇటీవల విశాఖలో హత్యకు గురైన నందిగాం మండలం దిమిలాడకి చెందిన సనపల రమణయ్య కుటుంబాన్ని శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పరామర్శించారు. రమణయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతని భార్య అనూష, తల్లి శకుంతల, సోదరుడు రోహిణీరావు తదితరులను పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ హత్య పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తహసీల్దార్ రమణయ్యను హత్య చేయడం విశాఖ ప్రాంతంలో నేరచరిత్రలను గుర్తుచేస్తున్నాయన్నారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, నేతలు మళ్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, అట్టాడ రవి ప్రసాద్, హరి, మాదిన లోకనాథం తదితరులున్నారు.



రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అచ్చెన్నాయుడు

గోశాల ప్రారంభం

నరసన్నపేట: శ్రీరాంపురంలో సురభి గోశాలను డా. కింజరాపు అమ్మన్నాయుడు శనివారం ప్రారంభించారు. మూగ జీవుల పరిరక్షణకు గోశాలను ఏర్పాటు చేసిన పంచిరెడ్డి విశ్వనాథం (బుజ్జి)ని అభినందించారు. శివాలయం వార్షికోత్సవంలో పాల్గొని గ్రామస్థులు పూజలు చేశారు.

మంచినీటి బావులకు శంకుస్థాపన

సంతబొమ్మాళి: మండలంలోని తీరప్రాంతాలైన మరువాడ, చిన్నమరువాడ గ్రామాల్లో రెండు మంచి నీటి బావులకు సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం బావులను తవ్విస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుయువత కార్యదర్శి సూరాడ దాసురాజు, మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్, నెం.యం.210., శ్రీకాకుళం

ఆర్‌సి నెం.2/ప్రిమిసెస్/2023-24 — తే. 09.02.2024 ది

టెండర్ నోటీసు

ఈ దిగువ తెలుపబడిన పనులు నిర్మాణమునకు ముఖ్యకార్యనిర్వహణాధికారి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, శ్రీకాకుళం వారు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి బిడ్లు కోరుచున్నారు.

వ. నెం.	పని పేరు	కేంద్ర కార్యాలయము 2వ అంతస్తు నిర్మాణము	మందస బ్రాంచి నూతన భవనం నిర్మాణం	నరసన్నపేట బ్రాంచి ఆధునీకరణ పనులు
1	అంచనా విలువ	రూ.65,13,328/-	రూ. 35,05,004/-	రూ. 20,53, 373/-
2	ఈయండి	రూ.65,133/- (జి.ఎస్.టి అదనం)	రూ. 35,050/- (జి.ఎస్.టి.అదనం)	రూ. 20,534/- (జి.ఎస్.టి.అదనం)
3	కాంట్రాక్టు వ్యవధి	6 మాసములు	6 మాసములు	6 మాసములు
4	కాంట్రాక్టు అర్హత	3వ తరగతి కాంట్రాక్టర్ మరియు పైబడి	3వ తరగతి కాంట్రాక్టర్ మరియు పైబడి	3వ తరగతి కాంట్రాక్టర్ మరియు పైబడి

పై పనులకు సంబంధించి

వ. నెం.	వివరము	తేదీ
5	షెడ్యూల్ అమ్మకము ప్రారంభ తేదీ	13/02/2024 (ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు బ్యాంకు పనివేళలో
6	షెడ్యూల్ అమ్మకము ముగింపు తేదీ	19/02/2024 (మధ్యాహ్నం 12.00 గంటలకు)
7	షెడ్యూల్ స్వీకరించు ఆఖరు తేదీ	21/02/2024 (సాయంత్రం 5.00 గంటల వరకు)
8	సాంకేతిక మరియు ఫైనాన్సియల్ బిడ్ తెరచు తేదీ	22/02/2024 (ఉదయం 11.00 గంటలకు)

పైన తెలుపబడిన పనుల యొక్క టెండర్ డాక్యుమెంట్లుకు, నిబంధనలు మరియు ఇతర వివరములను పొందుటకు ముఖ్యకార్యనిర్వహణాధికారి డిసిసి బ్యాంకు, శ్రీకాకుళం వారి పేరు మీద రూ.5000/-లు + 18% జిఎస్‌టి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచీలలో గాని లేదా ఏదైనా షెడ్యూల్ బ్యాంకులో గాని డిడి తీసి బ్యాంకు కేంద్ర కార్యాలయము, దండివీధి, శ్రీకాకుళం నందు అందజేయవలెను. తదుపరి సమాచారమునకు మరియు సందేహములకు శ్రీ ఎస్.వి.ఎస్.జగదీష్, జియం, సెల్: 9160018911, శ్రీ ఎస్.వి.సత్యనారాయణరావు, డిజియం, సెల్: 9160018912 మరియు మేనేజర్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్: 9160018915 వారిని సంప్రదించవలెను. వివరములు బ్యాంకు వెబ్‌సైట్ www.dccb-srikakulam.org నందు కలవు.

ముఖ్య గమనిక: బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి వారికి టెండరు భాగముల వారీగా విడదీయుటకు, వాయిదా వేయుటకు లేదా ఏ ఇతర కారణములు చూపించకుండా తిరస్కరించుటకు లేదా టెండర్ ప్రక్రియ రద్దు చేయుటకు అధికారము కలదు.

శ్రీకాకుళం
తేది: 09-02-2024 — సం/- డి.వరప్రసాదు, ముఖ్యకార్యనిర్వహణాధికారి, డిసిసి బ్యాంకు, శ్రీకాకుళం

ఖత్తర్‌లో వలస కూలి మృతి

కంచిలి, ఫిబ్రవరి 10: కంచిలి మండలం అర్జునపు రానికి చెందిన బుడ్డెపు గున్నయ్య(53) ఖత్తర్ దేశంలో గుండెపోటుతో శుక్రవారం మరణించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గున్నయ్య మూడు నెలల కిందట ఖత్తర్‌కు వలస వెళ్లాడు. అక్కడ రోజు కూలీగా పనులు చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్టు ఫోన్‌ద్వారా సమాచారం వచ్చిందని అతని భార్య కిరమణి తెలిపారు. మృతదేహం రెండు రోజుల్లో స్వగ్రామానికి వస్తుందని తెలియజేశారని కన్నీటిపర్యంతమయ్యారు. గున్నయ్యకు ముగ్గురు కుమార్తెలు సంతోషి, గీతాంజలి, అక్షయ ఉన్నారు. సంతోషి, గీతాంజలి డిగ్రీ చదువుతుండగా, అక్షయ ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు రోదిస్తున్నారు.


గున్నయ్య మృతదేహం

తెప్ప బోల్తాపడి మత్స్యకారుడు..

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలపల్లి పోతయ్య (67) తెప్ప బోల్తాపడి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. శనివారం తెల్లవారు జామున పోతయ్య మరికొంత మందితో కలసి చేపల వేటకు సముంద్రంలోకి వెళ్లాడు. అలల తాకిడికి తెప్ప బోల్తా పడడంతో పోతయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య పిల్లలు ఉన్నారు. పోతయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేశారు.


పోతయ్య (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పలాస: కోసంగిపురం వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న అన్న, చెల్లెలు సవర దివాకర్, వెన్నెల ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వీరిది మందస మండలం కొండలోగాం. అటుగా వెళ్తున్న సోంపేట జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు వారికి సపర్యలు చేసి 108 వాహనంలో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే గేటును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● గంటపాటు స్తంభించిన రైలు, రోడ్డు ట్రాఫిక్

పలాస: కాశీబుగ్గ ఎల్‌సీ గేటును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గేటు ధ్వంసమైంది. ఈ సంఘటనతో సుమారు గంటపాటు రైలు, రోడ్డు ట్రాఫిక్ నిలిచిపోయింది. శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం-2 డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి ఉంది. ఎల్‌సి గేటు వద్దకు వస్తున్న సమయంలో గేటు వేసేందుకు సైరన్ మోగడంతో దీన్ని గుర్తించని ఆర్టీసీ డ్రైవర్ బస్సు లోపలకు వెళ్లే క్రమంలో గేటును ఢీకొంది. గేటు విరిగి బస్సుపై పడడంతో గేట్‌మేన్ అప్రమత్తమై రైళ్లకు సిగ్నల్ ఇవ్వకుండా జాగ్రత్త వహించారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని గేటును సరి చేయించారు. ఈ నేపథ్యంలో గంటపాటు బెంగుళూరు-హౌరా, పాసింజర్ రైలుతో పాటు మొత్తం నాలుగు రైళ్లు వివిధ రైల్వే స్టేషన్లలో నిలిచిపోయాయి. రోడ్డుపై ట్రాఫిక్ కిలోమీటరు పొడవునా నిలిచిపోవడంతో కాశీ బుగ్గ పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన బస్సును రైల్వే పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఆర్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.


బస్సు ఢీకొనడంతో విరిగిన గేటు

శంకర్‌ను పరామర్శించిన మంత్రి ధర్మాన

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 10: దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎచ్చెర్లకు చెందిన వైసీపీ నేత, వైస్ ఎంపీపీ ప్రతినిధి జరుగుళ్ల శంకరరావును మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ధర్మాన వద్ద శంకర్‌రావు తన గోడు వెళ్లగక్కారు. 'ఎమ్మెల్యే గొర్లె కిరణ్ నాపై కక్ష కట్టి.. అణగదొక్కుతున్నారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ మొదలవలస చిరంజీవి, కార్యకర్త సత్యనారాయణ నన్ను వేధిస్తున్నారు. ఈ హత్యాయత్నం ఆ ముగ్గురే చేయించి ఉంటారని బలంగా నమ్ముతున్నా'నని మంత్రికి వివరించారు. దీనిపై ధర్మాన స్పందిస్తూ పోలీసులతో ప్రత్యేక దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. దోషులను శిక్షిస్తామన్నారు. ● విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కూడా శంకరరావును పరామర్శించారు. ఇటువంటి హత్యారాజకీయాలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. మరో నాయకుడు పిన్నింటి సాయి మాట్లాడుతూ.. శంకర్‌కి తమ పూర్తి మద్దతు ఉందన్నారు.


శంకర్‌తో మాట్లాడుతున్న ధర్మాన

కార్యకర్తల ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

శంకర్‌కు న్యాయం చేయాలని, దోషులను శిక్షించాలని ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. అలాగే తమకు న్యాయం చేయాలంటూ శంకర్ కుటుంబ సభ్యులు శ్రీకాకుళం డీఎస్పీకి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని, న్యాయం చేస్తామని డీఎస్పీ భరోసా ఇచ్చారు.

దాడిని ఖండించిన వెలమ సంఘం

అరసవల్లి: జరుగుళ్ల శంకరరావుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా వెలమ సంఘం నేతలు తెలిపారు. నిందితులను త్వరగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నాయకులు ఎ.రామారావు, బి.కృష్ణమూర్తి, దుర్గాప్రసాదరావు, సీహెచ్.రాంబాబు, ఆర్.కృష్ణారావు, బి.అసిరినాయుడు, ఎస్.రామరాజు తదితరులు కోరారు.

షిరిడీ సాయి వ్రతాలు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని షిరిడీ సాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు కాగడ హారతి, పాలాభిషేకం, హోమాలు, తదితర పూజలు నిర్వహించారు. సామూహిక సాయి సత్య వ్రతాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.


వ్రతం చేస్తున్న మహిళలు

సిక్కోలు నుంచి నలుగురు స్పీకర్లు

● గుర్తు చేసుకున్న తమ్మినేని సీతారాం
● తొలి మహిళా స్పీకరుగా ప్రతిభాభారతి
● శాసనసభ సమావేశాల్లో ఆసక్తికర చర్చ

రణస్థలం, ఫిబ్రవరి 10

సిక్కోలు నుంచి అసెంబ్లీకి ఇప్పటివరకూ నలుగురు స్పీకర్లు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం అసెంబ్లీలో చివరి సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాం భావోద్వేగ ప్రకటన చేశారు. గత ఐదేళ్లుగా సహకారం అందించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుంచి స్పీకర్‌గా తాను నాలుగో వ్యక్తిని అని గుర్తుచేశారు. దీంతో శాసనసభ వేదికగా ఎమ్మెల్యేల మధ్య సిక్కోలు చరిత గురించి ఆసక్తికరంగా చర్చ నడిచింది.

● ఆంధ్ర రాష్ట్ర రెండో స్పీకర్‌గా రొక్కం నరసింహందొర



ఆంధ్ర రాష్ట్ర శాసనసభ రెండో స్పీకర్‌గా రొక్కం నరసింహందొర పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన తొలితరం కాంగ్రెస్ నాయకుడు. 1955లో టెక్కలి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏడాదిన్నరపాటు స్పీకర్‌గా వ్యవహరించారు. 1955 ఏప్రిల్ 23 నుంచి 1956 డిసెంబరు 3 వరకూ ఆయన పదవిలో ఉన్నారు.

● ఉమ్మడి ఏపీలో ఏడో స్పీకర్‌గా తంగి సత్యనారాయణ



ఏపీ శాసనసభ ఏడో స్పీకర్‌గా తంగి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ హయాంలో టీడీపీ ప్రభుత్వంలో 1983 జనవరి 18 నుంచి 1984 ఆగస్టు 28 వరకూ పదవీలో కొనసాగారు. ఈయన శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 1967, 1983లో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శాసనసభలో జరిగే చర్చలు వార్తా పత్రికల ద్వారా ప్రజలకు యథాతథంగా చేరాలని, రాజకీయపరమైన, వ్యక్తిగత రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తూ సభా కార్యక్రమాలను నిష్పక్షపాతంగా అందించాలని 1983 సెప్టెంబరు 19న రూలింగ్ ఇచ్చారు.

● తొలి మహిళా స్పీకర్‌గా ప్రతిభాభారతి



ఏపీ శాసనసభ 11వ స్పీకర్‌గా కావలి ప్రతిభాభారతి బాధ్యతలు చేపట్టారు. ఏపీ అసెంబ్లీ చరిత్రలో ఈమె తొలిమహిళా స్పీకర్‌గా రికార్డు సాధించారు. 1999 నవంబరు 11 నుంచి 2004 మే 30 వరకూ ఆమె పదవిలో కొనసాగారు. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎచ్చెర్ల నుంచి ప్రాతినిధ్యం వహించా రు. అంతకుముందు ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో కీలక మంత్రిత్వ శాఖలను నిర్వర్తించారు. 1999లో చంద్రబాబు హయాంలో ఆమెకు స్పీకర్ పదవి వరించింది. 2000 సెప్టెంబరు 13న వెనుకబడిన ప్రాంతా ల అభివృద్ధిపై జరిగిన చర్చల సమయంలో ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకూ.. 16 గంటలపాటు శాసనసభను నిర్వహించారు.

● నవ్యాంధ్ర రెండో స్పీకర్‌గా సీతారాం



నవ్యంధ్రప్రదేశ్‌కు రెండో స్పీకర్‌గా తమ్మినేని సీతారాం 2019 మే 30న బాధ్య తలు చేపట్టారు. ఈయన ఆమదాలవలస నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. మంత్రి పదవిని ఆశించారు. కానీ ఈయనకు స్పీకర్ పదవికి ఎంపిక చేస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈయన అధ్యక్షతన ప్రస్తుతం చివరి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. టీడీపీతో రాజకీయ అరంగేట్రం చేసిన తమ్మినేని సుదీర్ఘకాలం ఆ పార్టీలో కొనసాగారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసీపీలో చేరారు.

ఇచ్ఛాపురం చేరుకున్న లోకేశ్

● ఘన స్వాగతం పలికిన శ్రేణులు

ఇచ్ఛాపురం: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి నారా లోకేశ్ చేపట్టనున్న 'శంఖారావం' యాత్ర కోసం శనివారం రాత్రి ఇచ్ఛాపురం చేరుకున్నారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ నుంచి కాన్వాయిలో ఇచ్ఛాపురం సురంగిరాజా మైదానంలోని సభా ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. అలాగే, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ప్రతీ ఒక్కరితో 11గంటల వరకు లోకేశ్ ఫొటోలు తీసుకోవడంతో కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో మాట్లాడి ఆలింగనం చేసుకున్నారు. మైదానంలో ఏర్పాటు చేసిన బస్సులోకి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


కార్యకర్తలతో లోకేశ్ కరచాలనం

నేటి పర్యటన ఇలా..

శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని రాజావారి మైదానంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ● 10.40 గంటలకు బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీపై ప్రచారం. టీడీపీ కార్యకర్తలకు అభినందన ● 10.50 గంటలకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రసంగం ● 10.55 గంటలకు యువనేత లోకేష్ ప్రసంగం ● 11.15 గంటలకు ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ కేడర్‌తో ముఖాముఖి ● 11.25 గంటలకు పార్టీ కేడర్‌కు 'సూపర్-సిక్స్' కిట్లు అందజేత ● 11.28 గంటలకు పార్టీ కేడర్‌తో ప్రతిజ్ఞ ● 11.29 గంటలకు కేడర్‌తో లోకేష్ సెల్ఫీ● 12.30 గంటలకు పలాస నియోజకవర్గానికి చేరిక ● 12.30 గంటలకు పలాస మండలం కంబిరిగాం జంక్షన్ వద్ద భోజన విరామం. ఇదేరీతిన అన్ని నియోజకవర్గాల్లో సమయాల్లో మార్పు చేస్తూ కార్యక్రమం జరగనుంది. రాత్రి ఏడు గంటలకు నరసన్నపేట నియోజకవర్గం జమ్ము జంక్షన్‌కు చేరుకుని అక్కడ బస చేస్తారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి


కిన్నెరవాడలో 'బాబు ష్యూరిటీ' నిర్వహిస్తున్న టీడీపీ నేతలు


చిగురువలస గ్రామంలో..

సారవకోట(జలుమూరు): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. శనివారం కిన్నెరవాడ గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ తర్ర లచ్చుము, మట్టగోవిందరావు, చల్ల జనార్దన్, కూర్మాన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. **సరుబుజ్జిలి:** మండలంలోని చిగురువలసలో శనివారం మండల తెలుగు యువత నాయకులు బస్వా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో నాయకులు వాన నరేష్, బాణ్ణ రమేష్, అలుగు రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీది ఫేక్ బతుకు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీది ఫేక్ బతుకు. తప్పుడు జీవోలను సృష్టించి పేటీఎం బ్యాచ్‌తో సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతోంది.' అని జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శనివారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవలే ఓ బూతు బొమ్మను రిలీజ్ చేశారని, అందుకు సంబంధించి తప్పుడు జీవోను సృష్టించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని వివరించారు. వైసీపీ సోషల్ మీడియా పూర్తిగా దిగజారిపోయిందని విమర్శించారు. కొన్నిరోజుల క్రితం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేరుతోనూ తప్పుడు పోస్టులను పేటీఎం బ్యాచ్ సృష్టించిందన్నారు. సైకో చేష్టలపై, సీఎం జగన్మోహన్‌రెడ్డి అవినీతిపై శంఖారావం పూరించేందుకు లోకేశ్ జిల్లాకు వస్తున్నారని తెలిపారు.


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

టీడీపీ, జనసేన విజయానికి కృషి

శ్రీకాకుళం క్రైం: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ విజయానికి కృషి చేస్తామని జనసేన జిల్లా అధ్యక్షుడు, పిసిని చంద్రమోహన్ అన్నారు. నగరంలోని సూర్యమహల్ థియేటర్ వెనుక ఉన్న కాలనీలో శనివారం జనసేన పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్తలు పేడాడ రామ్మోహన్‌రావు, కూరాకుల యాదవ్, సుశీల, చిరంజీవి, సంతోష్, భాస్కర్, సిద్ధు, పాపారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నవీకరణలో జాగ్రత్తగా వ్యవహరించాలి

● ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

కలెక్టరేట్: ఓటర్ల జాబితా తుది పబ్లికేషన్ తరువాత మార్పులు, చేర్పులు, ఇతర సవరణల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. కలెక్టర్లతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల సన్నద్ధత, కార్యకలాపాలపై కచ్చితమైన, సమగ్రమైన ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 17వేల దరఖాస్తులను రోజువారీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధులకు అవసరమయ్యే సిబ్బంది కోసం అన్ని శాఖలకు చెందిన ఉద్యోగుల డేటా ఎంట్రీ పూర్తి చేసినట్లు వివరించారు. బందోబస్తు, రవాణా వాహనాలు, రూట్ మ్యాప్‌లు తదితర అంశాలను ఇప్పటికే పూర్తి చేసినట్లు చెప్పారు. సిబ్బందికి తుది దశ శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. జిల్లాలో 597 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్వో రామ్మోహనరావు, ఆర్డీవో హెచ్.రంగయ్య, ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, సీపీవో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కె.వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలోని 37, 38 పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలపై హెచ్ఎం బొడ్డేపల్లి రామకృష్ణతో మాట్లాడారు. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించండి

రణస్థలం: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఓటర్ల నమోదు ప్రత్యేక అధికారి పద్మావతి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న 309 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు ఎలా ఉన్నాయో గుర్తించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి: ఎస్పీ

ఎచ్చెర్ల: పోలీసులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. శనివారం ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో నిర్వహించిన మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.ప్రేమ్‌కాజల్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కేవీ నర్సింగరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

అరసవల్లి: వెట్టి చాకిరీ, మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆధ్వర్యంలో స్థానిక న్యాయసేవా సదన్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అధికారులు శాంతిశ్రీ, కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ముగిసిన భాగవత సప్తాహం

శ్రీకాకుళం అర్బన్: రూరల్ మండలం పొన్నాం గ్రామంలోని కేశవ స్వామి దేవస్థానం ఆవరణలో వారం రోజులుగా జరుగు తున్న శ్రీమద్ భాగ వత సప్తాహం కార్య క్రమం శనివారం ముగిసిం ది. ఆలయ అర్చకు లు మహీంద్రాడ నారాయణాచార్యులు పర్యవేక్షణలో భాస్కరభట్ల శ్రీరామ్మూర్తి, శృంగారం లక్ష్మీ ధనుంజయశర్మ ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

తాగునీటి కొరత లేకుండా చూడాలి

అరసవల్లి: రాను న్న వేసవిలో జిల్లాలో తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరి యా విజయ అధికా రులను ఆదేశించారు. శనివారం జడ్పీలో స్థాయీ సంఘం సమావేశాలు జరిగాయి. వివిధ శాఖల పనితీరుపై ఆమె సమీ క్షించారు. మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. జడ్పీ ఉప ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, సీఈవో డి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీఈవో వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: నగరంలోని శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ ఎంపికలు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 35-50 ఏళ్ల పైబడిన మహిళ, పురుష క్రీడాకారులు పాల్గొనవచ్చునని చెప్పారు. ఎంపికైన వారు ఈ నెల 16 నుంచి 18 వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆ సంఘం సీఈవో సంపతిరావు సూరిబాబును సంప్రదించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే మోదీ ధ్యేయం

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం అన్నారు. శనివారం బాతువ, డీఆర్‌వలస, నడిమివలస, పున్నాం, గెడ్డకంచరాం గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మోదీ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, నాయకులు గట్టెం అప్పలరాజు, పొగిరి దాశరథి, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. **ఆమదాలవలస:** కొర్లకోట గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, మండల అధ్యక్షుడు చింతాడ అప్పారావు, నాయకులు పేడాడ ధర్మారావు, సంపత్‌రావు, రామారావు పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డుల ఏర్పాటు

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం చెక్ పోస్టు వద్ద జాతీయ రహదారిపై ప్రమాద సూచిక బోర్డులను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్‌రాజు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. ప్రమాద స్థలాల వద్ద వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ఇచ్ఛాపురం: డిగ్రీలో విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. శనివారం స్వర్ణభారతి విద్యాసంస్థలో డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. డిగ్రీ పూర్తయిన తరువాత విద్యార్థులు పోటీ పరీక్షలు రాసి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ సుజాత, ప్రిన్సిపాల్ సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

బూర్జ: మండలంలోని మదనాపురం ప్రభుత్వ పాఠశాలలో శనివారం దాశరెడ్డి ఫౌండేషన్ (పెద్దపేట) ఆధ్వర్యంలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.గోపాలరావు, ఉపాధ్యాయులు పి.మౌళి, ఎం.రవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ ప్రారంభోత్సవాలు

గార: ప్రసిద్ధ శ్వేతగిరిపై నూతనంగా నిర్మించిన అభయాంజనేయ, అయ్యప్ప, సుబ్రహ్మణ్య సహిత నవగ్రహ దేవాలయ ప్రారంభోత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ పూజలు చేయనున్నట్లు చెప్పారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

గార: మధ్యప్రదేశ్‌లో ఇటీవల మృతి చెందిన సిమ్మపేట గ్రామానికి చెంది ఐటీబీపీ కానిస్టేబుల్ దుంగ రాంబాబు కుటుంబానికి తోటి సిబ్బంది రూ.2 లక్షలు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి రమణ మూర్తి, గొలివి శంకర్ పూడి జితేంద్ర, ముద్దపు నారాయణరావు, మురళి దాసరి అప్పన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా నుంచి 887 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ప్రిన్సిపాల్ పరశురామయ్య తెలిపారు.

డీఎస్పీకి సన్మానం

శ్రీకాకుళం క్రైం: జిల్లా దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ ఎస్.వాసుదేవ్‌ను శనివారం సిబ్బంది సన్మానించారు. విజయనగరం దిశ డీఎస్పీగా ఆయనకు బదిలీ కావడంతో సిబ్బంది సత్కరించారు. సీఐ వెంకటరావు, ఎస్ఐలు రేవతి, చంద్రకళ, ఏఎస్ఐ విజయకుమార్,సిబ్బంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: మండలంలోని పాత్రునివలస స్టేడియంలో 14వ రాష్ట్ర స్థాయి జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతు న్నాయి. శనివారం మొత్తం 13 మ్యాచ్‌లు జరిగాయి. శ్రీకాకుళం, అనంతపురం, అనకాపల్లి, శ్రీ సత్యసాయి జిల్లాలు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. క్రీడాకారిణులను టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గ యువనాయకుడు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పంచిరెడ్డి అప్పల నాయుడు, ఎండు చిన్నారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.